


# ఆత్మభ్రమణం

మంచికంటి

ఎంతదూరం వచ్చినా వాళ్ళమాటలు వెంకట్రామయ్య చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఇంతకాలం కాపాడు కుంటూ వచ్చిన పెద్దరికం ఏమైపోయినట్టు. ఎప్పుడూ ఒకరికి చెప్పడమే కానీ, ఒకరిచేత ఒకమాట పడిందిలేదు. అలాంటిది ఇవాళ తనకి వాళ్ళు ఉచిత సలహా ఇవ్వడం, అదీ స్వంత ఇంటి సమస్య కావడం భరించడం కష్టంగా తోస్తుంది.

తన చెల్లెలు ఇంట్లో ఉంటున్నా తనకేనాడూ భారమనిపించ లేదు. ఆమె తన ఇష్టానికి ఏం చేస్తున్నా ఎలాంటి తలవంపులు తీసుకురాదనీ తెలుసు. అయితే తాను ఆలోచించినట్లుగా అందరూ ఆలోచిస్తారా! ఈ ప్రశ్న తనను పదేపదే వేధిస్తుంది. ఇంతకాలం ఈ విషయాన్ని గురించి ఇంత తీవ్రంగా ఆలోచిం చింది లేదు. ఇవాళ ఒక్కసారిగా అనుకోని పరిస్థితి ఎదురయ్యే సరికి మనసంతా అల్లకల్లోలంగా ఉంది.


## T.A. ENTERPRISE

***Manufacturers of*:** Teflon, Nylon. P.P. All Plastics and Hylam Components.

***Dealing in* :** Champion, Hindustan, Fenrodo, Reinz Talbrons, Delrin, Nylon, Hylon, Acrylic, Good Year Fanner, Dunlop, Hilton, Syndaxgo Sheets, Charminars, Rutolene Klipco, Rubber Sheets, P.V.C. P.P. H.D.P.C. Fevicol, Lacolite, Anubond, Mahindra & Mahindra, Araldite, Cutling Tobls, Fasteners, Rxnes, Hand tools, Precision, Measuring Instruments, Pipes Pipe Fittings, Welding Accessories & Food Aditives, all types of bearings & General Order Suppliers.

**A Home of Industrial Needs.**

Post Box No. 2067, No : 5-1-373
Old Ghasmandi, Ranigunj,
Sec-bad - 500 003

ఇంట్లోకి అడుగు పెట్టగానే పిల్లవాడి ఏడుపు వినిపించింది. అటు తిరిగి చూసేసరికి ఒక మూలన కూర్చుని రమణ ఏడుస్తూ కనిపించాడు.

''రమణా ఎందుకు ఏడుస్తున్నావ్? ఇట్రా....'' అంటూ పిలిచాడు వెంకట్రామయ్య. వాడు అక్కడ నుండి కదలకుండా ఏడుస్తూనే ఉన్నాడు.

''జయా'' అంటూ పెద్దగా కేకవేశాడు లోపలికి చూస్తూ.

అద్దం ముక్కలు ఏరుతున్న జయమ్మకు వెంకట్రామయ్య కేక వినిపించి అటువైపు చూసింది కానీ తన పనిలో తను మునిగిపోయింది.

''ఏమిటి వీడు. ఎందుకేడుస్తున్నాడు?'' లోపలి చిరాకు బయటకు స్పష్టంగా కనిపించింది.

ఆయన కేకలు అద్దం పెంకులు గుచ్చుకున్న ఆమెకు మరింత బాధ కలిగించాయి.

''నిన్ను గాదూ పిలుస్తుంది'' సహనం నశించిందాయనలో.

''ఏం నన్నుగాకుంటే ఏడ్చేవాడినే అడగొచ్చుగా'' చిటపటలతోనే సమాధానం చెప్పింది. రోజురోజుకీ ఎందుకింత కర్కశంగా మారిపోతుందీమె. పిల్లవాడన్న కనికరం కూడా చూయించములేదంటే... ఆలోచించాల్సిందే అనుకుంటూ తనే స్వరం తగ్గించాడు.

''ఎందుకు జయా అలా అరుస్తావు. ఏం చేశాడు వాడు అద్దం పగల గొట్టాడా?'' ఏం చేస్తే మీ కెందుకులే! మీ వాళ్ళు ఏంచేసినా సంతోషమేగా. నీళ్ళునీళ్ళు వంకలు పారతాయి గానీ...'' అంటూ కళ్ళల్లో నీళ్ళు తుడుచుకుంది.

''జయా ఎందుకింత రాద్ధాంతం చేస్తావు? ఎవరి పిల్లలైనా పిల్లలే కదా! మనం కంటేనే పిల్లలా? ఇతరులు కంటే పిల్లలు కాకుండా పోతారా? పిల్లలన్నాక చిన్నచిన్న తప్పులు చెయ్యకుండా ఉంటారా చెప్పు?'' అంటూ ఆమె చేతివైపు చూశాడు. చేతి నుండి రక్తం కారుతుండడంతో కంగారుగా వొచ్చి చెయ్యి పట్టుకున్నాడు.

''ఏయ్ మొద్దు రక్తం కారుతున్నా తెలియడం లేదా! మరీ ఇంత మొద్దు తరహాగా ఉన్నావేంది. లే పైకి' అంటూ చెయ్యి పట్టుకుని పైకి లేపాడు.

''రోజూ ఏదో ఒకటి భరించలేక పోతున్నానండీ. ఆ అమ్మాయి ఇంటి పట్టున ఉండి పిల్లల్ని చూసుకోవచ్చుగా'' బాధగా చెప్పింది.

''వాడు పిల్లాడు పగుల గొట్టాడు సరే. నీ తెలివేమైంది. అద్దం పెంకులు జాగ్రత్తగా కదా తీసేది. చూడు ఎంత గాయమైందో'' అంటూ వెనుక గదిలోకి నడిపించాడు.

''నాకు జాగర్తలు చెబుతారు గానీ, మీ చెల్లెలికెందుకు చెప్పరో అర్థం కావడం లేదు. నేను చెబుదామంటే, అదుగోవొచ్చి ఇంట్లో ఉంటుందని గదా వొదిన ఆడిపోసుకుంటుంది అంటారు''.

''ఎందుకు జయా కాలికేస్తే వేలికీ వేలికేస్తే కాలికీ.... ఎవరికేమీ చెప్పాలో అర్థం కావడం లేదు.'' టింక్చర్ వేసి కట్టుకడుతూ చెప్పాడు.

''ఎవరికి చెబుతారండీ. కట్టుకున్నదాన్ని నేనా కదాన్ని ఉన్నానుగా. ఊళ్ళో వాళ్ళు ఎన్నెన్ని రకాలుగా మాట్లాడుకుంటున్నారో మీకేం తెలుసు. ఇంట్లో ఉండి వినేది నేను కదా! ఎంత బాధగా ఉంటుందో చెప్పండి. ఎవరికి చెప్పుకోవాలి నేను'' తన బాధనంతా ఆయనతో చెప్పింది.


''నిజమే జయా నీ బాధ నాకు తెలుసు. దాని రాత బాగలేక అది పుట్టింటిదగ్గరే ఉండాల్సొచ్చింది. ఎంతోకాలం దాన్ని ముత్తయిదువుగా చూడలేక పోయాను. లోకులు కాకులు వాళ్ళనే మాటలు నాచెవిన పడలేదనుకుంటున్నావా! నేనెంతగా కుమిలి పోతున్నానో తెలుసా నీకు. వీలు తప్పినప్పుడు ఎన్నయినా పడాల్సిందే'' కళ్ళద్దాలు తుడుచు కుంటూ తన బాధను ఆమె ముందుంచాడు.

''ఆ అమ్మాయిని పిల్చి మీరెందుకు గట్టిగా చెప్పకూడదు. చిన్నపిల్ల కాదు గదా ఈ వయసులో ఎలా ఉండాలో ఒకరిచేత చెప్పించుకోవడం ఏంటండీ చోద్యం కాకపోతే! అందరికీ లేరా చెల్లెళ్ళు మీకేనా ఉంది. మీ పరువు బజారుకీడుస్తున్నాగానీ పల్లెత్తు మాట అనకుండా ఉంటారు. మీ మంచితనమే ఆ అమ్మాయిని అలా చేస్తుంది''.

ఆమె ఎత్తి పొడుపు మాటలు వింటూ, కుర్చీలాక్కుని ఆలోచనలో మునిగిపోయాడు వెంకట్రామయ్య. జయమ్మ గోడకానుకుని అలాగే కూర్చుంది.

''రాజీ ఏదో చేస్తుందని నేను అనుకోవడం లేదు. అయితే తన ప్రవర్తనను బట్టే ఆమె ఏదో చేస్తుందని, అతనితో ఏదో సంబంధముందనీ అనుకుంటున్నారు. సున్నితమైన మనసున్న వాళ్ళని లోకం వెంటబడి తరుముతూనే ఉంటుంది. రాజీలాంటి వాళ్ళకు బయటి ప్రపంచంతో సంబంధముండదు. వాళ్ళు పని వాళ్ళు చేసుకుపోతుంటారు. లోకం ఎప్పుడూ ఇలాంటి వాళ్ళని గురించే పట్టించుకుంటుంది''.

''మీ చెల్లెలు భర్తా ఆ అబ్బాయి ఒకరినొకరు వదిలిపెట్టి ఉండలేని స్నేహితులైతే మాత్రం భర్త ఉన్నప్పుడు రావడం పోవడం బాగానే ఉండేది. అప్పుడు ఎవరూ వీళ్ళని గురించి అనుకోలేదే. అసలప్పుడు ఆక్షేపించాల్సిందేముంది. భర్త చనిపోయిన తరువాత కూడా అతని స్నేహితుని దగ్గ



# అశోక® - T
రాయల్ ఫ్లవర్ ఫ్యామిలీ టాల్క్

7 దశాబ్దాలకు మించిన సౌందర్య పరిమళం

సాటిలేని సువాసన, గంటల తరబడి రోజంతా తాజాదనం.
అందం మరియు తాజాదనానికి సంబంధించి 7 దశాబ్దాల అనుభవంగల నిపుణులచే తయారుచేయబడినది

Mfd. by: విజయ కెమికల్స్ & టాయిలెట్ వర్క్స్ తెలంగాణ.,
చెన్నై-600 106. ఫోన్: 2475 7299 ఇ-మెయిల్: hairgrot@vsnl.com





రకు పోయి కూర్చోవడం బాగుందా చెప్పండి. ఊళ్ళో వాళ్ళు అనుకుంటున్నారంటే అనుకుంటారు. లోకానికి విరుద్ధంగా నడుస్తుంటే అనుకోరూ...''

''తల పైకీ కిందకూ ఊపాడు వెంకట్రామయ్య. జయా నువ్వు చెప్పేది నిజమే. రాజీకీ పెళ్ళయిన తరువాత గానీ, ముందుగానీ మన మూడిళ్ళు తప్ప ఇంకో ఇల్లు తెలుసా చెప్పు. ఇవాళ తన తలరాత చెడిందని తనే తెలుసుకోవాలి. భర్త లేడు కదా అతని దగ్గరకు వెళ్ళొచ్చా వెళ్ళకూడదా అని తానే ఆలోచించుకోవాలి. తనకై తాను తెలుసుకోకపోతే ఏం చెయ్యాలిచెప్పు. అప్పటికీ ఒకసారి చూచాయగా హెచ్చరించాను. ఏమంటుంది పాపం భోరున ఏడుస్తూ వెళ్ళింది.''

''అంతకంటే ఏం చెప్పాలండీ. తనేమైనా చిన్నపిల్లా ఒకటికొట్టి చెప్పడానికి. అతని క్కూడా భార్యా పిల్లలుంటే సరేనండి. ఇంట్లో ఉండేది ఇద్దరే ఇద్దరు. పైకి లేచీలేవలేని ముసలమ్మా అతనూ. జనాలు అనుకుంటారంటే అనుకోరూ'' దెప్పి పొడుపుగా అంది.

''ఈ అనుకునే జనాలంతా దానికి పోయిన పసుపు కుంకుమలు తెచ్చిస్తారా! దానికి మన శ్శాంతేమన్నా తెచ్చిస్తారా! బయటి వాళ్ళు అంటున్నారని మనం కూడా దాన్నీ, దాని పిల్లల్నీ సాధిస్తే ఎట్లా చెప్పు'' ఆమె వంక సూటిగా చూస్తూ అడిగాడు.

''అనడనండి. నన్నుగాక ఇంకెవరినంటార్లే మీరు. వీలైనంతవరకూ నేను కూడా సర్దుకుపోతూనే ఉన్నానండీ. ఇరుగుపొరుగు సూటిపోటి మాటలే భరించలేకుండా ఉన్నాను'' కింది పెదవిని పంటితో నొక్కి పెట్టుకుంటూ సంజాయిషీ చెప్పిందామె.

''ఏం చేస్తాం జయా. ఎంతదూరం బతిమిలాడాను. భర్త చనిపోయిన వాళ్ళు ఎంతెంత వయసులో ఉన్నా తోడుకోసం పెళ్ళిళ్ళు చేసుకోవడం లేదా! అప్పటికీ పిల్లల్ని మనమే చూసుకుంటామని కూడా చెప్పాం కదా! నా మాట వింటేనా! మీకు భారంగా ఉంటే చెప్పండి నాదారి నేను చూసుకుంటాను అంటుందా! పోనీ ఏదైనా ఉద్యోగం చేస్తే అలాగన్నా ఈ బెడద తప్పిపోతుందంటే నావల్ల కానే కాదంటుంది.

నువ్వు చెప్పు జయా ఈ చేతుల్తో దాన్ని ఎంత అల్లారుముద్దుగా పెంచుకున్నాను. కన్నతల్లి కూడా లేకపోతే ఎంత బాధపడుతుందోనని నేనే అన్నీ దగ్గరుండి చూసుకునే వాడిని. ఇప్పుడు... ఇలాంటాప్పుడు... నాకు భారమైతే ఎక్కడికైనా వెళ్ళిపోతుందట. ఏం చెయ్యమంటావు చెప్పు. అంతా నా తలరాత. మన కళ్ళ ముందు అది అట్లా తిరుగుతుంటే గుండె కోసేసినట్టు ఉంటుంది. అందరిలాంటి పిల్లా అది.

అతగాని ఇంటికి పోవడం తప్ప, ఇంకెక్కడికైనా పోతుందా! అదేందో దాని పుస్తకాలేందో! ఆ పుస్తకాలు వాటి విషయాలు గురించి అతగాడికి తెలిసినంతగా ఎవరికీ తెలియదై పోయే. దీని భర్త కూడా పుస్తకాల పురుగేగా! అతను బతికున్నప్పుడు వీళ్ళు ముగ్గురూ కూర్చుంటే చూడాలి. ఎదుటి వాళ్ళకు పిచ్చెక్కి పోతుంది. అందుకే ఇప్పుడు కూడా అతని దగ్గరకు పోకుండా ఉండలేక పోతుంది.

''ఏమైనా ఎల్లకాలం ఆ విధంగా జరగడం మంచిది కాదండీ. మన పిల్లలూ పెద్దోళ్ళు అవుతున్నారు. వాళ్ళకీ పెళ్ళిళ్ళు కావాలి కదా! ఆడపడుచూ ఫలానా అనుకుంటుంటే నా పిల్లలేమైపోతారు. మీరే ఆలోచించండి. మీరు చెప్పకపోతే నేనైనా చెబుతాను'' కొంచెం దృఢంగానే చెప్పిందామె.

తల అడ్డంగా ఊపుతూ పైకి లేచాడు వెంకట్రామయ్య. ఆమె కూడా పైకి లేచింది. ఆమె భుజమ్మీద చెయ్యేసి, చూద్దాం ఏం జరగాల్సుంటే అదే జరుగుతుంది. నా ప్రయత్నం నేను చేస్తాను'' అన్నాడు.

ఆమె వెంకట్రామయ్య చేతిని మెల్లగా తడిమి ఆయన కళ్ళల్లోకి చూసింది.

అయినా ఆమె వంక చూసి మౌనంగా తలాడిస్తూ అక్కడి నుండి కదిలాడు.

హాల్లో తేజ ఏడ్చి ఏడ్చి అక్కడే పడుకుని నిదురపోయాడు.

వెంకట్రామయ్య వాడిని పైకిలేపి భుజానవేసుకుని బయటకు తీసుకు వచ్చి మంచమ్మీద పడుకోబెట్టి, తను ఈజీ చైర్లో కూర్చున్నాడు.

ఇంత విషమస్థితి తనకు రావడమేమిటి. ఎవరైనా ఇలాంటి స్థితిలో ఏం చేస్తారు. ఎదుటి వాళ్ళ గురించి ఆలోచించని వాళ్ళయితే, ఎదుటివాళ్ళ మనసుతో పనిలేని వాళ్ళయితే తమకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటారా! తమ చుట్టూ తాము రక్షణ వలయము ఏర్పరచుకుంటారా! తమ స్వార్థానికి కావలసిన విధంగా ప్రవర్తిస్తారా!

నేనెందుకు నా గురించి, నా కుటుంబం గురించి, పరువు ప్రతిష్టల గురించి ఆలోచించలేక పోతున్నాను. చెల్లెలంటే అంతగా అభిమానం ఉండడమూ వలనా లేక ఎదుటి వాళ్ళ కష్టసుఖాల గురించి కాస్తోకూస్తో ఆలోచించడమూ వల్లా? ఎంతకూ ఆలోచనలు ఒక కొలిక్కి రాలేదు. అలాగే కళ్ళు మూతలు పడిపోయాయి.

''అమ్మగారూ అమ్మగారూ'' రంగమ్మ వాకిట్లో నిలబడి కేకేసింది. ఆ కేకకు వెంకట్రామయ్య కళ్ళు తెరిచాడు.

''ఏం రంగమ్మా ఏం కావాలి'' కళ్ళు నులుముకుంటూ లేచాడు.

''అమ్మగారు లేదంటయ్యా'' ఇంట్లోకి చూస్తూ అడిగింది.

'లోపలేందో పని చేస్తుంది లాగుంది. మొద్దు మొహంది చెయ్యి తెగ్గోసుకుంది. అట్టనే పని చేస్తుంది'' తన సానుభూతిని చూయించాడు.

''చెయ్యి కోసుకుందా' పెద్ద గాయమా ఏందయ్యా'' అరుగుమీద కూర్చుంటూ గాభరగా అడిగింది రంగమ్మ.

''లేదులే అద్దం పెంకు గుచ్చుకుంది. కట్టుకట్టాలే'' అన్నాడు. అయ్యయో అంటూ ఇంట్లోకి చూడసాగిందామె.

''పిల్లలు బడికెళ్తున్నారా రంగమ్మా'' కళ్ళు మూసుకుంటూ అడిగాడు వెంకట్రామయ్య.

''ఆ.. ఏం బడిలే అయ్యగారూ. అయ్య జూడబోతే తాగి తందనాలాడుతుండాడు. నేనా రోగిష్టి

దాన్ని, ఒకరోజు పనికిపోతే నాలుగు రోజులు నాగా అయిపోయె. వాడు సంపాయించ్చింది వాడి తాగుడుకీ సరిపోదు. పావలాబేడా మిగిల్తే ఆ రంకులాడి ముండ ఉందిగా దాని యెదాన పొయ్యడమే సరిపోతుంది. ఆవు చేల్లో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా! పెద్దోడు నేను చదవనని బేల్దారు పనికి ఎల్లిపోయేడు''.

''మరి చిన్నోడన్నా కాస్త చదువుకుని అక్కరకొస్తాడా లేదా!''

ఆ... వాడా... వాడప్పుడప్పుడూ పోతాడయ్యా! అయినా గవర్నమెంటు బళ్ళల్లో ఏముందయ్యా. ఆందరూ ఇంగిలీసు బళ్ళకు పోతుంటే. ఆ పంతుళ్ళు కూడా ఒక రోజొస్తే రెండ్రోజులు రారయ్యా. ఈ యేడు జూసి ఈణ్ణీ హైదరాబాద్ పంపిస్తానయ్యా. నేల మీద గీతలు గీస్తూ చెప్పింది.

''ఆ పనెందుకు చేస్తావు గానీ ఒక్కణ్ణన్నా చదివియ్యి. సుబ్బరాజు లింకా ఆ రమణని వొదిలి పెట్టలేదంటే ఇంకా మీకా శనేశ్వరం వొదలలేదన్న మాటేగా!''

''హయ్యో రామా ఏం జెప్పమంటారయ్యా. అదేకదా నా కొంప కొల్లేరు చేస్తుంది. పోతే పోయేడయ్యా ఎంతమంది మొగోళ్ళుతిరగడమూ లేదు గానీ, దానికి అదేందో జబ్బొచ్చిందంటయ్యా'' రహస్యం చెబుతున్నట్టుగా చెప్పింది.

''అది ఈయనకు కూడా తగులుకుంటదనే దిగులుగా ఉందయ్యా. తాగుబోతోడైనా తిరుగుబోతోడైనా ఒక మొగుడనేవాడు ఉంటేనే గదంటయ్యా ఆడదానికి మంచీ మర్యాదానూ!'' దీర్ఘం తీస్తు చెప్పిందామె.

ఆమె మాటలు విన్న వెంకట్రామయ్యకు ఎక్కడో మనసులో కలుక్కుమంది. తనను ఉద్దేశించి అనడం లేదుకదా ఈమె, కళ్ళు తెరిచి తల ఎత్తి ఆమె వంక పరీక్షగా చూశాడు.

తలవంచుకుని ఉన్న రంగమ్మ తన లోకంలో నుండే తను మాట్లాడుతుంది. మీ ఇంట్లో ఎట్టుందో మాది అంతకంటే అర్థానం బతుకుగా ఉందిలేయ్యా. ఏదో ఆలోచిస్తూ చెప్పింది. ఆ మాట అన్న తరువాత గానీ అర్థం కాలేదు. తనేం మాట్లాడిందో భయం భయంగా వెంకట్రామయ్య వంక చూసి తల పక్కకు తిప్పుకుంది నాలుక కొరుక్కుంటూ.

అప్పుడుగాని అర్థంగా లేదాయనకు రంగమ్మ అంటుంది. తన చెల్లెలి గురించేనని అయినా ఏమీ తెలియనట్టు దూరంగా చెట్ల వంక చూడసాగాడు.

నా ముందు నా కుటుంబాన్ని గురించి వెక్కిరింపు మాటలు అనడానికి ఈమె స్థాయి వాళ్ళు కూడా సిద్ధపడుతున్నారనే విషయం అర్థమౌతుంది. పొరపాటున నోరు జారింది గానీ నా ముందు మాట్లాడే ధైర్యం లేదీమెకు. రానురాను ఇలాంటి వాళ్ళకు నా ముందు మాట్లాడే ధైర్యం కూడా వొస్తే రావొచ్చు.

ఇన్నాళ్ళూ మామూలు విషయంగానే తీసుకున్నాను. ఇంక లాభం లేదు. చాటుమాటున ఎవరేమనుకున్నా బాధలేదు. ఈ మనిషీ ఇవాళ నోరు జారిందంటే ఇంక రానురాను ఎవరైనా ఎదురుపడి మాట్లాడతారు. అనుకుంటూ లేచి ఇంట్లోకి వెళ్ళాడు.

వెంకట్రామయ్య ఇంట్లోకి వెళ్ళడం తోటే ఆయన వైపు భయం భయంగా చూస్తూ అక్కడి నుండి దొంగలాగా మెల్లగా జారుకుంది.

ఇంట్లో వెంకట్రామయ్యకు జయమ్మ ఎదురుపడింది.

''ఏమిటండీ అలా ఉన్నారు. ఎవరితోటీ బయట మాట్లాడుతున్నారు'' జయమ్మ అడిగింది.

''రంగమ్మ నీ కోసం వొచ్చింది. బయట కూర్చొంది'' చెప్పి పెరటి వైపు నడిచాడు.

''ఏందట. ఎందుకొచ్చిందో!'' బయటకు చూస్తూ అడిగింది.

''ఏమో! తన మొగుణ్ణి గురించి చెబుతుంది. దాంతోపాటు మన గురించి కూడా...'' అంటూ ఆగిపోయాడు.

''ఏంటండీ. మన గురించేమీ చెప్పింది'' ఆతృతగా అడిగింది.

''ఆ... ఏం లేదులే'' చెప్పి బాత్‌రూమ్ వైపుకు వెళ్ళాడు.

''ఏందే రంగమ్మా'' అంటూ జయమ్మ బయటకు వచ్చింది.

అరుగు మీద ఎవరూ లేక పోవడంతో, ''ఇక్కడ ఎవరూలేరు కదండీ'' అంటూ లోపలికి వచ్చింది.

''వెళ్ళిపోయిందేమో మొహం తుడుచుకుంటూ టేబుల్‌పై ముందు కుర్చీ లాక్కుని కూర్చున్నాడు వెంకట్రామయ్య.


జయమ్మ అన్నం వడ్డించింది.

వెంకట్రామయ్య తింటున్నాడే గానీ, రంగమ్మ అన్నమాటలు చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి.

***

రాజీకి ఆ ఇంటినుండి ఈ ఇంటికిరావడం రోజురోజుకూ ఇబ్బందికరం అయిపోయింది. తను వొచ్చేటప్పుడు పోయేటప్పుడు ఎంతో మంది చూపులు తనపై ఉంటాయనే సంగతి తనకు తెలుసు. ఇన్ని రకాలుగా హింస పడుతూ

## ఎడిటర్ టైలర్ లాంటివాడు!




అలహాబాద్ నుంచి వెలువడే ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'లీడర్'కి దీర్ఘకాలం చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి సంపాదకులుగా పని చేశారు. సివై. చింతామణి - సంపాదక వృత్తిలో ఎన్నో ఉన్నత ప్రమాణాల్ని ఏర్పరిచారు. హరి హర బ్రహ్మదులు కాదన్నా తను రాయదల్చుకొన్నది రాసేవారు.

అధికారులకి భయపడి అబద్ధాలు రాయడం, అవతలివాడు పెద్దవాడు కదా అని విమర్శలో ఘాటు తగ్గించడం చేసేవాడు కాదు. వార్తలూ, విశేషాలూ కూడా ఎంతవరకు అవసరమో అంతే - నిజం ఎంత ఉంటే అంతే, గోరంతలు కొండతలు చేసి రాయడం, అహో ఓహో అని పొగడ్డం ఆయనకి కిట్టవు.

రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్‌కి గాంధీ, రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రి ప్రభృతులతో కలసి లండన్ వెళ్లి, తిరిగివచ్చి, ఆ విశేషాలు లీడర్‌లో కొన్ని పరిమితమైన వ్యాసాల్లో వ్రాశారు చింతామణి. దానిమీద కొంచెం కోపం తెచ్చుకుని ''వివరంగా రాయలేదేం? చాలా చోట్ల వార్తల్ని ముక్క ముక్కలుగా కట్ చేసి వేశావు? ఎందువల్ల?'' అని అడిగారు గాంధీ. అందుకు చింతామణి నెమ్మదిగా ''ఎడిటర్ మంచి టైలర్ లాంటి వాడు. అవసరం అయినంతవరకే వుంచి, తక్కినవి కట్ చేస్తాడు'' అన్నాడు. ★

కూడా ఆ ఇంటికి పోకుండా ఉండలేక పోతుందా తన్ను తాను చాలాసార్లు ప్రశ్నించుకుంది.

సమాధానం లేదు అనే వొచ్చింది. అప్పటికీ ఒకసారి బలవంతమ్మీద ఒక వారం రోజులు పోకుండా ఆగితే, ఊ...హూ... ఒక్కరోజు ఒక్కో యుగంలా గడిచింది. అంతనరకం అనుభవిస్తూ ఇంట్లో ఉండేకంటే అక్కడకు పోవడమే మంచి దనే మళ్ళీ వెళ్ళడం.

ఇంతకూ అతన్లో తన భర్తను చూస్తున్నానా! ఒక మగవాడిని చూస్తూన్నానా! స్నేహితుణ్ణి చూస్తున్నానా! తనకు స్వాంతన కలిగించే అతని మాటలు చూస్తూన్నావా! ఎన్నోసార్లు తనను తాను ప్రశ్నించుకుంది. దేనికీ అవుననే సమాధానం తనకు దొరకలేదు. అతని దగ్గరకు పోవడం, అతనితో మాట్లాడ్డం, ఆ వాతావరణంలో ఉండడం తనకొక సాంత్వన. తన మనసు కొక ఊరట. అంతకు మించిన సమాధానం తట్టడం లేదని తనకు తెలుస్తూనే ఉంది.

వాకిట్లోకి అడుగు పెట్టగానే మంచంపై నిద్ర పోతూ తన కొడుకు కనిపించాడు. దగ్గరగా పోయి కళ్ళకు అడ్డం పడిన ముంగురులను పక్కకు నెట్టి తదేకంగా వాడి ముఖం వంక చూసింది. అచ్చువాళ్ళు నాన్నపోలికే అనుకునేసరికి దుఃఖం కట్టలు తెచ్చుకుంది.

ఏడుపు ఆపుకునేందుకు నోటికి చెయ్యి అడ్డు పెట్టుకుని ఇంట్లోకి వెళ్ళింది.

అప్పుడే భోజనం ముగించుకుని బయటకు వస్తూ వెంకట్రామయ్య ఎదురయ్యాడు.

"ఏందమ్మా అది" చేతిలోని టిఫిన్ బాక్స్ వంక చూస్తూ అడిగాడు.

అంత ప్రత్యేకంగా ఏదీ అడగని అన్నయ్య అంత సూటిగా అడిగేసరికి దుఃఖంతో ఉన్న ఆమె తడబడుతూ సమాధానం చెప్పలేక తలదించుకుంది.

"ఏందమ్మా మాట్లాడవూ!" మళ్ళీ అడిగాడు.

"టిఫిన్ తీసుకు వెళ్ళానన్నాయ్యా. వాళ్ళమ్మ మంచంపట్టింది. ఆయనక్కూడా జ్వరంగా ఉంటేనూ" మొదటిసారిగా అన్నయ్యకు సంజాయిషీ చెబుతున్నట్టుగా అనిపించింది.

'ఎవరికీ? ఎవరింటికీ? ప్రశ్నించడానికే ప్రశ్న వేసినట్టనిపించింది.

తెలిసి కూడా అన్నయ్య అంత గుచ్చిగుచ్చి అడగడంలో ఆంతర్యమేమిటో ఆమెకు అర్థం కాలేదు.

"ఇలాంటి సందర్భం ఒకటి మనిద్దరి మధ్య వస్తుందని ఎప్పుడూ అనుకోలేదమ్మా" ఆయన కూడా తలవంచుకునే చెప్పాడు.

ఆమె బెదిరిపోయి అతని వంక చూసింది.

వెంకట్రామయ్య హాల్లోకి వెళ్ళి కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

ఆమె కూడా అతని వెంటే వెళ్ళి ఎదురుగా నిల్చుంది.

"కూర్చో" అంటూ కుర్చీ చూయించాడు.

ఇవాళ అన్నయ్యెందుకో తేడాగా కనిపిస్తున్నాడు. ఏం జరిగి వుంటుందో అనుకుంటూ కుర్చీలో కూర్చుంది. ఆయన మౌనంగా ఆమె వంక చూశాడు.

అన్నయ్యా... నేను...నాగురించి..మాట మాట కూడబలుక్కుంటూ ఏదో చెప్ప బోయింది.

"అమ్మా రాజీ నువ్వేమీ చెప్పబోతున్నావో నాకు తెలుసమ్మా" ఆమె వంక ఆప్యాయంగా చూస్తూ చెప్పాడు.

"అయితే లోకం... లోకం సంగతేమీ చేద్దామమ్మా! మన చుట్టూ ఆదొకటి ఉంది గదా!"

ఇన్నాళ్ళూ లోకమెకటుందనీ, దానికోసమేదో భయపడాలని నేనూ అనూకోలేదు. నువ్వూ అనుకోలేదు కదా అన్నయ్యా. ఇవాళ నేనేమీ కాని పని చేస్తే మన మధ్యకు ఆ లోకం వచ్చింది. సూటిగా అడిగిందతన్ని.

అంత ఖచ్చితంగా అడిగే సరికి తడబడ్డాడ తను.

"ఎప్పుడూ పరిస్థితులు మనచేతిలోనే



ఉండవు కదమ్మా'' తడబాటును కప్పి పుచ్చుకుంటూ చెప్పాడు.

''మన చుట్టూ ఉన్న లోకానికి మన ఆలోచనలతో గానీ, మన మనసుతో గానీ, మన సుఖ సౌభాగ్యాలతో గానీ ఏ మాత్రం పనిలేదమ్మా. అది ఎప్పుడెప్పుడు ఎవరెవరిని తప్పుబట్టాలా అని చూస్తూనే ఉంటుంది''.

''అప్పుడు మనం తప్పుచేసిన వాళ్ళలాగా దానికి తలవంచాలా! మన మీద స్వారీ చెయ్యమని దానికి అవకాశం ఇవ్వాలా!''

అవసరం లేదమ్మా. లోకం ఏమనుకున్నా మన అనుకున్న వాళ్ళందరూ మన వెంటే నిలబడ్డప్పుడు, మనం చేసేపనిలో కూడా భాగం పంచుకుంటున్నప్పుడు ఎవరి గురించీ ఆలోచించాల్సిన అవసరం లేదు.

''మన ఇంట్లో... నన్ను ... గురించి... ఓహో... అవునవును'' తల మెల్లగా ఊపింది.

''చూడమ్మా మీ వదిన చదువుకున్నా మనంత ఆలోచించే శక్తి లేదామెకు. అప్పటికీ నేను సర్దిచెబుతూనే ఉన్నాను. కాబట్టే ఇన్ని రోజులు నీతో ముఖాముఖీ మాట్లాడలేదు. ఇంట్లో ఆడపిల్లలు కూడా పెద్దవాళ్ళవుతున్నారు కదమ్మా. అందుకే భయపడుతుంది.

జయమ్మ వంటింట్లో నుండి హాల్లోకి వచ్చి తొంగి చూసి మళ్ళీ వంటగదిలోనికి వెళ్ళిపోయింది.

''ఎన్నోసార్లు ఈ విషయం మీ్మద తను నాతో పోట్లాడింది. అయినా నా మాటకు విలువ ఇవ్వడం వల్ల తానే సర్దుకుపోతుంది'' వంట గది వైపు చూస్తూ నెమ్మదిగా చెప్పాడు.

ఇప్పుడైనా ఇంత గట్టిగా ఎందుకుచెప్పాల్సొస్తుందంటే, ఆమెకు ఇదే ధోరణి పడి పోయిందమ్మా. ఎప్పుడూ ఇదే ఆలోచన. ఆ ప్రభావం ఇప్పుడిప్పుడే పిల్లల మీద కూడా పడుతుంది. ఇది మంచిది కాదమ్మా. అందుకే...'' ఆమె ఏమనుకుంటుందోనని తల ఎత్తి ఆమె వైపు చూశాడు.

ఆమె మౌనంగా అన్నయ్య చెప్పిన మాటలు వింటుంది.

ఆ మౌనాన్ని భగ్నం చేస్తూ మళ్ళీ అతనే అన్నాడు. ''చూడమ్మా ఒక ఆడ ఒక మగ ఎంత గొప్పగా స్నేహంగా ఉన్నప్పటికీ, ఎంత పవిత్రంగా ఉన్నప్పటికీ వాళ్ళను ఆడా మగ గానే చూస్తారు కానీ ఎవ్వరూ ఆదర్శమని ప్రత్యేకంగా చూడరమ్మా''.

''అవునన్నయ్యా ఆ విషయం నాకు తెలుసు. అప్పుడుప్పుడూ అదే అనుకునేదాన్ని. ఎప్పుడో ఒకరోజు ఇలాంటి సందర్భం వొస్తుందనే అనుకున్నాను.'' కాలు పైకి బెట్టి మోకాలు మీద తల ఆన్చుతూ చెప్పింది.

''మనిషికి శారీరక సుఖమే పరమార్థమనుకునే లోకమమ్మా ఇది. దానికంటే అతీతమ్మైన మనసొకటుందనీ దానికి కావలసింది కాస్తంత ప్రేమ, అభిమానం, వాత్సల్యం. చల్లని ఓదార్పు అనే విషయం ఎంతమందికి తెలుస్తుంది. లోకానికి కావలసిందికేవలం బాహ్యంగా కనిపించేవి మాత్రమే. ఏం తిన్నావు. ఎంత సంపాయించావు. ఏ మేం నగలున్నాయి. ఎన్నెన్ని ఆస్తులు కూడబెట్టావు ఇవే కదా! ఇవన్నీ ఉంటే మనిషి ఏం చేసినా చెల్లుబాటవుతుంది. ఎవరేమనుకున్నా పట్టించుకునే స్థితిలో ఉండడు.

పైగా సున్నితమ్మైన నీలాంటి మనస్సున్న వాళ్ళను అలాంటి వాళ్ళంతా గుచ్చి గుచ్చి చూస్తారు. పొడిచి పొడిచి తరుముతారు. ఇన్నాళ్ళూ నీ మనసు అర్థం చేసుకున్నాను కాబట్టి ఏమీ అనలేకపోయాను. ఇప్పుడు కూడా చెప్పలేదంటే ఇక మీ వదిన ఏం చేస్తుందో చెప్పలేకుండా ఉంది. అదొక గొడవ అవసరమా మనకు. అందుకే..'' అన్నాడు.


ఇంత సున్నితమ్మైన మనసెందుకు వచ్చింది తనకు. ప్చ్... ఆయన ఎంత సూక్ష్మంగా ఆలోచించే వాడో! ప్రతి చిన్న విషయానికీ ఎంతగా స్పందించేవాడో! ఆత్మీయమ్మైన దృశ్యం చూసినప్పుడల్లా కళ్ళవెంట బొటబొట కన్నీళ్ళు కార్చేవాడు. అంత బేలగా ఉండే వనుషులుంటారని నవీన్‌ని చూసిన తరువాతే తెలిసింది. ఆయన్ని చూసి నేనూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే ఆహా సరైన జోడీరా బాబూ అని అందరూ ఎగతాళి చేసేవారు.

తనకీలోకంలో ఇంతకంటే ఇంక కావలసిందేముందని సంబర పడ్డాను. ఆ సంబరం మూన్నాళ్ళ ముచ్చట అవుతుందని కలలోనైనా ఊహించినా, కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతూ కిందకు దూకుతున్నాయి. అప్రయత్నంగా తల తిప్పుకుందామె.

ఆమె ఎంత కుమిలి పోతుందో నాకు తెలుసు. అయినా ఇవాళ ఆమెను బాధపెట్టాల్సి వొచ్చినందుకు నేనెంత బాధ పడుతున్నానో నా చెల్లెలికి తెలిస్తే బాగుండు అనుకున్నాడు వెంకట్రామయ్య.

ఇద్దరూ ఒకేసారి తలలెత్త ఒకరి వంక ఒకరు చూసుకున్నారు.

''ఈయన అచ్చం నవీన్‌లాగే మాట్లాడతాడు. నవీన్‌లాగే ఆలోచిస్తాడు. అలాగే స్పందిస్తాడన్నయ్యా. అందుకే ఈయన దగ్గరకు పోలేకుండా ఉండలేక పోతున్నాను. అచ్చం నవీన్‌తో మాట్లాడుతున్నట్టే ఉంటుంది. చాలామంది చాలా సందర్భాల్లో అన్నారు. ఎవరైనా ఆడవాళ్ళుఆడవాళ్ళతో స్నేహం చేస్తారు గానీ మగవాళ్ళతో స్నేహాలేంటని.



అందరిలాగా నేనెప్పుడూ ఈయన భౌతిక రూపం చూడలేదు. నవీన్‌నలా అతనూ మానసికంగా వేరు వేరని నాకెన్నడూ అనిపించలేదు'' కళ్ళొత్తుకుంటూ చెప్పిందామె.

''రాజీ నాకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరము లేదమ్మా నువ్వు. నిన్ను మరీ అంత బాధ పెడుతున్నాననుకుంటే, ఈ విషయం ఇంతటితో వొదిలేద్దామమ్మా. ఏదైతే అదవుతుంది'' పైకి లేవబోయాడు వెంకట్రామయ్య,

''అన్నయ్యా వొద్దొద్దు'' అని వారించడంతో మళ్ళీ అక్కడే కూర్చున్నాడు.

''వొద్దన్నయ్యా వొద్దు. ఇప్పటికీ నా వల్ల ఎంతో బాధ పడుతున్నావు. ఆ విషయం నాకు తెలుస్తూనే ఉంది. అయినా ఏం చెయ్యను. వదిన కూడా ఎప్పుడూ నన్ను పల్లెత్తు మాటన్నది లేదు. ఆమె భయం ఆమెది. ఏ ఆడపిల్లల తల్లయినా అలాగే ఆలోచిస్తుంది. ఆమెను తప్పు పట్టడానికి కూడా లేదు.

నా మూలంగా ఈ ఇంట్లో ఏ గొడవ జరగడానికీ వీల్లేదు. తల ఊపుతూ చెప్పిందామె. వెంకట్రామయ్య మనసు కాస్త కాస్త తేలిక పడసాగింది.

''నేనే నా మనసు మార్చుకుంటానన్నాయ్యా. నా ఊహల్లోనే ఆయన్ని తలుచుకుంటాను. ఉద్యోగం చేస్తానన్నాయ్యా'' తన నిర్ణయాన్ని ప్రకటించింది.

''అమ్మా నువ్వు...'' లోపల ఆనందం బయటకు వ్యక్తమయ్యింది. పెదాలపై చిరుదర హాసం చోటు చేసుకుంది.

''అవునన్నయ్యా అప్పుడైతే నాకు ఒక వ్యాపకముంటుంది. బిజీ అయిపోతేనన్నా వీటిన్నింటినీ మరిచిపోవొచ్చు''.

''ఎప్పటి నుండో ఇలాంటి నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నానమ్మా. ఇంక ఎవ్వరూ ఏమనుకుంటారో చూద్దాం. చాలా మంచి నిర్ణయం. ఏమేవ్ జయమ్మా'' కేక వేశాడు వెంకట్రామయ్య.

లోపలి నుండి జయమ్మ హాల్లోకి వచ్చింది.

''చూశావా రాజమ్మ ఏమంటుందో!''

ఏందంటున్నాట్టు ముభావంగానే తలాడించింది.

''ఉద్యోగానికి వెళుతుందంట... ఆ...'' సంతోషంగా చెప్పాడు.

ఆమె ఎంత ముడుచుకుందామనుకున్నా ఆమె ముఖంలో సంతోషం తొంగి చూస్తూనే ఉంది.

''చాలా మంచిదమ్మా!'' అంటూ వొచ్చి చేతులు పట్టుకుని పైకి లేపింది.

రాజీ ఆమె ముఖంలోకి చూసింది. ఆమె ఆప్యాయంగా చెంపలపై చేతులుంచి... ''ప్చ్ ఆ భగవంతుడు అప్పుడప్పుడూ నీలాంటి వాళ్ళకి...'' బాధగా చెప్పింది.

''ఊరుకో వదినా'' అంటూ ఆమె రెండు చేతుల్నీ తన రెండు చేతులతో పట్టుకుంది. అన్నయ్య ఆనందంగా లేచి బయటకు వెళ్ళాడు.

వీళ్ళ ఆనందం కోసం తన ఆనందాన్ని త్యాగం చెయ్యలేనా. ఇన్నాళ్ళు శరీరం మొద్దుబారిపోయింది. ఇప్పుడూ మనసూ మొద్దుబారిపోతుంది. అంతేకదా అనుకుని కళ్ళు గట్టిగా మూసుకుంది రాజీ.

★

మంచికంటి
సెల్: 99495 35695

CENTURION GROUP OF INSTITUTES
www.cgi.ac.in

CSREM
Paralakhemundi
(An Autonomous Institute Recognised by All India Council of Technical Education, Ministry of HRD, Govt. of India)




PGDM (Eqv. to MBA) 2 Years
Full Time Residential

Specializations offered in :
- MARKETING
- HUMAN RESOURCE
- FINANCE
- RURAL MANAGEMENT
- SYSTEMS
- ENTERPRISE MANAGEMENT

The Institute has the privilege of visiting professors from Monash University, Victoria University and RMIT Australia for teaching and indepth research.

JAGANNATH INSTITUTE FOR TECHNOLOGY AND MANAGEMENT ( JITM ) PARALAKHEMUNDI, ODISHA
(Approved by AICTE, Recognized by Govt. of Odisha and Affiliated to Biju Patnaik University of Technology)

COURSES OFFERED :
B.Tech Programme (4 years)
- Electronics & Communication Engineering
- Electrical & Electronics Engineering
- Computer Science Engineering
- Mechanical Engineering
- Civil Engineering
- Electronics & Instrumentation Engineering
- Information Technology
- Chemical Engineering




87% Students placed in diff. companies despite of recession during the year 2008-09

CENTURION ITI, PARALAKHEMUNDI
COURSES OFFERED :
- FITTER
- ELECTRICIAN
- WELDER
- PLUMBER
- COMP. HARDWARE
- COMP. SOFTWARE

CAMPUS : Alluri Nagar, Po: R. Sitapur, Via: Uppalada, Paralakhemundi - 761 211, Dist. Gajapati, Odisha.
Tel: (06815) 223088 (Principal) - 223099, 222770 Fax: (06815) 222150 / 222976
CONTACT : 09437161831, 09437259993, 09438189916